కథానిక

# లోకం మరష్తుతు

కానుకొల్లు కృష్ణమూర్తి

"మరి... మరీ... మీరేమీ అనుకోకుండా ఉంటే—"

"ఆ రోజులు గడిచిపోయాయి లెండి. అయినా?—"

"అబ్బే ఏంలేదు. మీ భార్యా పిల్లలు ప్రస్తుతం ఎక్కడున్నారో అని..."

"ఇంతేనాండి—"ఫలానా చోటని అబద్ధం చెబుదామనుకున్నాడు, కాని ఆయన పెద్దమనిషి తరహా చూస్తూచూస్తూ, తీరా అబద్ధం చెప్పలేక పోయాడు. నిజం చెప్పితే నమ్ముతారా?"

"దానికేం?"

"నిజంగా నాకు తెలియదు."

"అదేమిటండీ, అలాగంటారు! మీ భార్యా పిల్లలు ఎక్కడున్నదీ మీకే తెలియదంటా రేమిటి? సంకోచిస్తున్నారేమో?"

"సంకోచించటాని కేముంది లెండిందులో. నేనీ కష్టాలలోపడ్డ తరువాత, నిజంగా వాళ్ళ ఆచూకీకూడా నాకు తెలియకుండా పోయింది."

"ఎన్నికష్టాలయితేమటుకు, భార్యా పిల్లలతోటి ఉత్తర ప్రత్యుత్తరాలు మానుకుంటారా ఎవరయినాను, విచిత్రంగా ఉంది మీమాట."

"ప్రేమానుబంధాలుంటేనేకదండీ, భార్యా పిల్లలూ, ప్రత్యుత్తరాలూ అంటూ ఉండడం."

అని అన్నాడే కాని రామానికి మనస్సు చివుకు మన్నది. కళ్ళు చెమ్మగిలినాయి. ఆయన చూసి పోతాడేమోనని తల వంచుకున్నాడు. ప్రపంచంలో యింకా మానవత్వం, సహృదయత పూర్తిగా సమసిపోలేదన్నమాట. లేదు కాబట్టే స్థిరాధారంలేని పక్షిలాగ, ఆ గూడుకు ఈ గూడుకు ఎగురుతూ, కాలం గడుపుతున్న రామం లాంటి దౌర్భాగ్యుని హృదయంలో కూడా యిపుడు కాకపోతే ఒకానొకప్పుడయినా ప్రేమ, మార్దవం, ఉండి ఉంటాయని గ్రహించకలిగాడీ మహానుభావుడు. హృదయంలేని ప్రపంచం దెబ్బమీద దెబ్బకొట్టిన కొద్దీ, నిజంగా తనకు కూడా హృదయంలేదని నమ్మడానికి క్రమంగా సంసిద్ధుడయినాడు. కాని ఈ ప్రశ్న మటుకు అతని గుండెలో చెయిబెట్టి కలచి వైచింది. తనూ ఒకప్పుడు సాధారణమయిన మానవుడే, ఆలుబిడ్డల తీపిని అనుభవించిన వాడే నని తనే మరచిపోతున్న విషయం మరల జ్ఞాపకానికి వచ్చింది. అసలీ రెండేళ్ళలోనూ "ఛీ ఛీ" "పో పొమ్మ"న్నవారేకాని "ఏం నాయనా, ఎలా వున్నావ"ని అడిగిన వారేరీ?

ఈనాటి ఈ కుశల ప్రశ్నతో, అతని ఇల్లాలి అమాయికపు మొహం, బుల్లిబాబు చిరునవ్వు మరల ఒకసారి మెరుపులాగ మెరిసాయి, ఆ చితికిన హృదయంలో. మొదటి జీతం రాగానే కొత్త కాపురపు మోజులో జీతమంతా పెట్టి కొన్న బహుమతులు తీసికెళ్ళి యిచ్చిన క్షణంలో, సిగ్గు ఆనందం విరజిమ్మిన ఆమె చిరునవ్వు మరీమరీ జ్ఞాపకానికి వచ్చింది. ఎక్కడుందో తను? చిట్టిబాబెక్కడున్నాడో కదా? అసలీ స్మృతంతా ఈ జన్మదేనా? లేక ఏ పూర్వ జన్మదోనా? ఈ జన్మలోదే ఎందుకు కాకూడదూ? తను మటుకు అందరిలాంటి మనిషికాదూ?

తను కాలేజీలో చదువుకునేటప్పుడు యెన్ని మేడలు నిర్మించుకున్నాడు! దేశంలో ఇళ్ళులేని వారందరికీ తన చేతులార యిళ్ళు కట్టబెట్ట గలుగుదునని సంతోషించేవాడు. బీడువారిపోతున్న పొలాలన్నింటికీ కాలవలు తవ్వి నీటి వసతులు కల్పించి, దేశాన్ని సస్యశ్యామలంగా చేయడంలో తనకూ ఒక భాగం ఉంటుందని గర్వించేవాడు. ఎన్ని కుగ్రామాలకు రోడ్లువేసి పల్లె జీవనాన్ని ఆనందమయం చేయగలనని తహతహ లాడేవాడు. ఉద్యోగంలో ప్రవేశించిన తరువాత కూడా, పరీక్షలు మటుకు పాసయితే చాలదు, నేర్చుకోవలసినది బోలెడంత ఉందని అతనికి తెలుసు. అందుకనే అహోరాత్రాలు అతి ఉత్సాహంతో ఆఫీసు పనిలోనే నిమగ్నుడయి యుండేవాడు.

కాలవ గట్టంబడి నడవడమంటే బహు సరదా రామానికి. కాలవ తనది, తన ప్రజలది. రెండు ప్రక్కలా ఉన్న పైరంతా తను పండిస్తున్నట్టే భావించుకునేవాడు. పాటలు పాడుకుంటూ, మాటలు చెప్పుకుంటూ సరదాగా పొలాల్లో పని చేసే రైతాంగంతోటి కబుర్లు కొడుతూ కాలువపై తిరగడానికి అతనికి విసుగు, విరామంలేదు. ఆ అమాయికపు పల్లెజనానికి పరమ మిత్రుడయాడు. అసలు వాళ్ళలో పూర్తిగా లీనమై పోయాడు.

కాని ఆ కాలువగట్టే అతని పుట్టి ముంచింది. ఇప్పటికీ ఆ సన్నివేశం బాగా గురుతుంది అతనికి. ఒకరోజున తనఖీ చేసుకుంటూ వెడుతుంటే, గురునాథం పరుగెత్తుకుంటూ వచ్చాడు, కొన్ని కాగితాలు పట్టుకుని.

"ఏమిటోయి, పరుగెత్తుకుంటూ వచ్చావు. కాగితాల పని ఏదయినా ఉంటే, ఆఫీసుకు వచ్చిందాకా ఆగలేక పోయావా? ఇక్కడికి కాగితాలెందుకు" అని అనేసరికి,

"అది కాదండి బాబుగారూ, దొరగారు రేపు ప్రొద్దున్న వస్తారని తంతి పంపించారు. అందుకని మీకు చెప్పడానికి వచ్చాను. తగిన బందోబస్తు చెయ్యాలిగామరి" అన్నాడు గురునాథం.

"దొరగారువస్తే రహదారి బంగళాలో ఉంటారు, భోజనమేమో పూటకూళ్ళమ్మ యింటినుంచి పంపించే ఏర్పాటుచేయి. అంతేగా"

"బందోబస్తంటే, యిదిమాత్రమే కాదండీ, వారికి ఒక బస్తాబియ్యం, ఒక బస్తా కందులు, పది వీశెల నెయ్యి, యింకా ఏవేవో, జాబితా యిచ్చాడులెండి ముందొచ్చిన దొరగారి బంట్రోతు."

"వారు డబ్బుపంపిస్తే, యివి కొనుక్కోవడంలో వారికి మనం చేసే సహాయం ఏమంత గొప్పకాదులే."

"అబ్బే, అదికాదండి. మీరొక్కమాటు కంట్రాక్టరు రామస్వామితో చెపితే."

"ఇదిగో చూడు, గురునాథం, యిలాంటివి నేను చేయలేనిపని."

"మీరేం చెయ్యక్కర్లేదండి. ఒక్కమాట. ఇలాంటివి మీరుమటుకే కాదండి బాబుగారూ చేసేది. ఇది అందరికీ మామూలే. ఒక్కమాట" నీళ్ళు నమిలాడు గురునాథం. ఊహుఁ బుర్రకెక్కలేదు. అందులోనూ కొత్తగా కాలేజీ వదలిపెట్టి ఉద్యోగానికి వచ్చాడాయెను. ఇలాంటివన్నీ సంస్కరిద్దామన్న భావాలు చాలా తీవ్రంగా ఉన్నాయి.

ఆ మరునాడుదయం ప్రోగ్రాం ప్రకారం, తూర్పు కాలవ మొగదగ్గర దొరగారికోసం ఎదురు చూస్తూనుంచున్నాడు. కారులోంచి దిగి, కాలవ గట్టెక్కుతోనే, యింజనీరుగారు—

"ఏమిటోయి, కాలవగట్టు యింత ఖంగాళీగా ఉంది. ఎవరూ దీన్ని చూస్తున్నట్టే లేదే, నీవు ఎప్పుడయినా వచ్చి దీన్ని తనిఖీ చేస్తునావా?" అని గర్జించారు.

"చిత్తం, నేను రెండు రోజులకొకసారి వచ్చి—"

"మరి యిలాగేడుస్తుందే, నీ తనిఖీ?"

"..............."

"రెండవ ఫర్లాంగుదగ్గర తూముకట్టడానికి ఎస్టిమేటు పంపించలేదేం?"

"అక్కడ తూము అసలింకా మంజూరే చేయలేదే తమరు!"

"ఏడ్సినట్టుంది నీ సంజాయిషీ! పైగా జవాబుకూడా చెబుతున్నావు భయభక్తుల్లేక? కాలవలోనుంచి యిసక బైటికిదీసిన పనికి రామస్వామికి నీవు తక్కువ బిల్లు యిచ్చావుట. కొలతలు సరిగా కొలవలేదని గొడవ పెడుతున్నాడాయన!"

"..............."

"తాసిల్దారుగారి బంగళాగురించి, వారెన్నిసార్లు వ్రాసినా మరమ్మత్తే చేయించలేదట, నీవు"

"..............."

"నాలుగవమైలు రాయిదగ్గిర ఉన్న మదుం సరిగ్గా బారలేదని రైతులు గొడవ పెడుతున్నారు. నీ వూరుకున్నావేం?"

"..............."

"పాలూరి రైతులు తూముకావాలంటే ఇవ్వక్కర్లా? ఏడ్సినట్లే ఉంది. నీ చదువూ, చట్టబండలూ, ఉద్యోగం, గిద్యోగమూను."

ఇలాగే దొర్లిపోయాయి నేరాలపైన నేరాలు. ఆరంభంలోనే దుమ్మెత్తిపోయడం చూసి, అతనికి చాలా ఆశ్చర్యం, దుఃఖం కలిగి బయులే చెప్ప లేకపోయాడు. నిజంగా నిద్రపోతున్నవాణ్ణి లేప వచ్చును కాని. నిద్ర నటించినవాణ్ణి, ఎలా లేపుతాం. నేరాలు నిజమయితే, సమాధానం చెప్పకోవచ్చును, కాని ..ఆ రోజు ఇంజనీరుగారి తనిఖీ అంతా యిలాగే అయింది. నిన్నటి గురునాథంయొక్క ఉద్బోధలోని పరమార్థం రామానికి యిప్పుడు తెలిసింది. ప్రభుత్వోద్యోగులంటే గౌరవస్థులనుకున్నాడు కాని, ఇలాంటి తుచ్ఛులు కూడా ఉన్నారని తను ఊహించుకోలేకపోయాడు. తను ఓవరుసీరు కాబట్టి యింత తృణీకరించి మాట్లాడాడేమో యింజనీరు.

"కొన్నాళ్ళుద్యోగంలో చేరాక, ప్రైవేటుగా పరీక్షలు ప్యాసయి అధికార్ల మెప్పుపొందితే, నీకే యింజనీరుద్యోగం అవుతుంది లేరా అబ్బాయి" అన్న వాళ్ళ నాన్నమాటలు జ్ఞాపకం వస్తూండేవప్పుడప్పుడు. ఆ ఆశతోటే చాలా కాలంగడిపాడు. తన ఆత్మాభిమానాన్ని, ఆత్మగౌరవాన్ని, నీచులయిన అధికారుల ఎదుట అనేకసారులు చంపుకున్నాడు. పెట్టకూడని చోట్ల తూములు అనేకం పెట్టించాడు. ఉప్పు, పప్పు, బియ్యం కూడా పైకి సప్లయిచేశాడు. ఇవన్నీ దృశ్యం తరువాత దృశ్యం కళ్ళకు కట్టినట్టుండిపోయింది. ఇలాగే తోసుకుని వచ్చేవాడే కాలాన్ని—అసలా బంగాళాకాపరి యింటి కప్పు విషయమయే యింజనీరుగారితో దెబ్బలాటయిపోయింది. మూడురోజుల క్రితం ఫ్రచ్చువాపా లెక్కించి, మంచి వాసాలను డబ్బడుగుతాడు కంట్రాక్టరు రామస్వామి. కాపరింటి కప్పేకదా, ఎవడు చూడొచ్చాడు బిల్లుప్యాసుచేయమంటాడు యింజనీరు. కాపరయినంత మాత్రాన ఏమిటీ నిర్లక్ష్యం? అలాగే కప్పువేసిన రెండు నెలలయిన తరువాతకూడా అలాగే ఉండిపోయిందా తగాదా. ఆ తగాదా దేవుడే తీర్చేశాడు ఆఖరికి. ఆ రాత్రి ఘోరకలి తలుచుకుంటే ఒళ్ళు జలదరిస్తుందిప్పటికి కూడాను. కప్పు విరిగి పడిపోయింది. కాపరి భార్య నీళ్ళాడి రెండునెలలే అయింది. అయోమయంగా ఉంది. పిల్ల కెవ్వుమని కేకేసింది.

* * *

నిద్రలో "హా"రని అరిచాడు రామం.

కళ్ళుతెరచి చూసేసరికి, కాలవాలేదు, గట్టూ లేదు. తనున్నది ప్లాటుఫారంమీద అని జ్ఞప్తికి వచ్చింది. తొందరపడి ఊళ్ళోకి వచ్చాడు. నా అన్నవాళ్ళు లేని ఈ బొంబాయిపట్టణంలో అటువంటి స్మృతులే అతనికి స్నేహితులు. కాని, పొట్ట గడవడానికి అలాంటి స్నేహితులెంతకాలం పనికి వస్తారు? కొల్లాయిగుడ్డ కట్టు, చిరిగిన చొక్కా, మాసిన గడ్డం, తనవైఖరి చూస్తే ఉద్యోగం మటుకెవరిస్తారు కనక. కార్పొరేషనులో ఎవరో తెలుగాయన ఒకరు పనిచేస్తున్నారని పోర్టరు చెప్పినట్లు జ్ఞాపకం వచ్చి, ఆయన దర్శనార్థం బయలు దేరాడు. తను ఓవరుసీరు పరీక్ష ప్యాసయినానంటే ఆయన నమ్ముతాడా? కాని చెప్పకపోతే ఎలాగ!

"అయితే మన ప్రాంతాల్లోనే ఉద్యోగం దొరుకుతుందే?"

"చేశానండి కొన్నాళ్ళపాటు."

"మరి ఎందుకు వదిలేశారు?"

"అక్కడ వాతావరణం నాకు పడక."

"వింతగా ఉంది. అయితే ఈ రెండేళ్ళు ఎలా గడిపారు?"

"అది నాకే అర్థంకాదండి"

"మీ భార్యా పిల్లలతోటి ఉత్తర ప్రత్యుత్తరాల్లేవూ?"

"ప్రేమానుబంధాలుంటే కదండీ!"

అతని కళ్ళు నీరుగ్రమ్మినాయి. గత జీవితంలో చితికిపోయిన అతని ఆశలన్నీ ఒక్కసారి కళ్ళకు గట్టినట్టయింది. అతని దరిద్ర జీవనంలో అబద్ధాలు చెప్పలేదనికాదు. కాని యిల్లాలి విషయంలోనే? చిట్టిబాబు విషయంలోనే? ప్రేమానుబంధం లేదూ? ఇదంతా విధికృతం.

"అయితే మీరు మూడు రోజులయిన తరువాత సర్టిఫికేట్లన్నీ తీసుకుని మరల కనపడండి."

"సెలవు"అని లేచి కొంతదూరం పోగానే మళ్ళీ పిలిచారాయన.

"మీరెక్కడుంటున్నారు?"

"చెప్పడానికి సిగ్గుగా ఉందండి."

"అయితే ఉండండి. కొంచెం సేపయింతరువాత నేనూ వస్తాను మా యింటికి పోదాం" అన్నాడాయన.

"అది కాదు రామం, ఎవరో ఒకాయన తుచ్ఛంగా నీచంగా ప్రవర్తించాడని, యిలా జీవితం పాడుచేసుకుంటారా?"

"ఎవరో ఒకరు యిలాగ ప్రవర్తించడమంటా రేమిటి శర్మగారూ, మన డిపార్టుమెంటు మొత్తం యిలాగే ఏడ్చిందని మీకు తెలియదు కనుకనా!"

"బాగుంది, అందుకని మనతల గోడకు బాదు కుంటామా?"

"మీలాంటివారుకూడా, మనమేం చేయగ లమని చెప్పి యిలా ఊరుకుంటే పరిస్థితులెలా బాగుపడతాయి చెప్పండి శర్మగారూ! చెడును ప్రతిఘటించడం మన కర్తవ్యం కాదంటారా?"

"కాదనడం లేదు రామం, కాని దానికొక మార్గం లేదూ? నీకు తోచినట్టుగా రాజకీయాల్లో దిగి పనిచేయకూడదూ?"

"బాగావుంది మీమాట. దీనికీనీ, రాజకీయాల కున్నూ సంబంధమేముందండీ?"

"పోనీ, రాజకీయాలు కాకపోతే, సంఘ సంస్కరణకోసం పాటుబడే సంస్థలు అనేకం ఉన్నాయి. వాటిలో ఎందులోనో ఒక దానితో చేరి ఎందుకు పని చెయ్యకూడదు?"

"సంఘ సంస్కరణ! సంఘ సంస్కరణ అంటేనే నాకు ఒళ్ళుమంట. ఏమిటీ సంస్థలు ఇన్నాళ్ళూ పనిచేసి మనకు చేసినమేలు? కూటి కోసం స్వార్థపరులు కనిపెట్టిన కోటి విద్య లలో ఒకటి కదండీ ఈ సంస్థల వ్యాపార మంతాను."

"ఇలా కాలికివేస్తే తలకి, తలకివేస్తే కాలికి అన్నట్టు మాటాడితే. నీ అభిప్రాయం ఏమిటి రామం?"

"అసలు సంగతి మీరు మరచిపోతున్నారు శర్మగారూ. ఒకళ్ళతోచేరి పని చెయ్యడ మెందుకు చెప్పండీ. ప్రపంచం ఈ దశలో ఉందంటే, ఒక మూకతోచేరి ఎవరయినా పని చేసినదాని ఫలితం అని మీరు పొరబడుతున్నట్టున్నారు. మూక కేం చేత నవునండి? ఎవరో బుద్ధుడు, క్రీస్తు, గాంధీ అలాంటి మహానుభావులు పూనుకుని తక్కిన వెర్రి వెధవలకంతా యింత జ్ఞానానికి మార్గం చూపిస్తే ఉంది, లేకపోతే లేదు."

ఇదే ధోరణయిపోయిం దతనికి. శర్మగారు ఎన్నో చెప్పిచూచారు. గొంతెమ్మ కోరికలు పెట్టుకుని, స్వర్గానికి ఎక్కుదామనే ప్రయత్నాలు మానుకుని ఏదో ఒక ఉద్యోగం చూసుకుని స్థిమితంగా కాపురం చెయ్యమని సలహా యిచ్చారు. రామం తలిదండ్రులకూ, అన్నదమ్ములకూ కూడా రమ్మని ఉత్తరాలు వ్రాశారు కాని, ఎవళ్ళూ జవాబుకూడా వ్రాయలేదు. ఐనా తెలుగువాడు, తన బంధువులుకూడా అతన్ని వదలి పెట్టేసి నట్టుంది, చదువురున్నవాడు - పైగా ఆహ్వానించి యింటికి పిలుచుకువచ్చాడు. చూస్తూ, చూస్తూ రామాన్ని రోడ్డుపాలు చేయడానికి శర్మగారికి మనసు రాలేదు. కూడూ గుడ్డా యివ్వడమే కాకుండా, ఉద్యోగానికి ఇటూఅటూ తిరగడానికి అప్పుడప్పుడు ఒకటో, రెండో రూపాయలుకూడా చేతిలో పెడుతూ వుండేవాడు, కొన్నాళ్ళ తరు వాత నయినా ఏ చిన్న ఉద్యోగమో సంపా దించలేకపోతాడా, అనే ధైర్యంతో. అయితే మటుకు ఎన్నాళ్ళని యిలా అతన్ని పోషించ గలడు? రోజులు పోనుపోను, రామం నిజంగా ఉద్యోగానికి ప్రయత్నంకూడా చేయలేదని అను మానం కలిగింది. కాని తన దగ్గిరనుంచి తీసు కుంటున్న డబ్బేం చేస్తున్నట్టు? పోనీ రామం పైలాపచ్చీసుగా తిరుగుతున్నాడా అంటే, అదీ లేదు. తనలో తనే మాట్లాడుకొనేవాడు. ఎవరూ లేకుండానే నవ్వేవాడు, ఏడ్చేవాడు. ఇంట్లో ఉన్నప్పుడల్లా ఏదోరాస్తూనేవుండేవాడు. ఎంతకూ తెగని ఈ బ్రహ్మరాత ఏమిటో శర్మగారికి బోధ పడలేదు. ఏమిటీ రామానికి డయిరీ రాయడం కూడా మామూలే, ఎంతమంచి అలవాట్లున్నాయి పాపం. ఐనా డయిరీలో ఏం రాసుకుంటాడో? రామానికి తెలియకుండా ఒకసారి అతని డయిరీ చూశాడు.

"అవును నేనే కారణం, నేనే హంతకుణ్ణి. అందులోనూ శిశుహంతకుణ్ణి. శిశుహత్యకు ప్రాయ శ్చిత్తం ఉంటుందేమో కనుక్కోవాలి. ఆc, నేను హంతకుణ్ణెందుకయినాను? పుచ్చువాసాలు హంత కులు! అయితే నీఆత్మాభిమానం ఎందుకు చంపు కున్నావు? అదిగదీ! అసలు హత్య ఇదీ! చచ్చిం దేమిటీ? నీ ఆత్మ గౌరవం, నీ వ్యక్తిత్వం, ఇలాంటి వగైరాలు." శర్మగారి కేమీ బోధపడ లేదు. పాపం, రామం హృదయం ఎంత వ్యాకు

లంగా ఉందో. ఒకనాడు రామం దరఖాస్తు వ్రాసి తన దగ్గిరకు తీసుకు వచ్చాడు సరిగ్గా ఉందేమో చూడమని.

"పెద్ద దొరగార్కి,

నేను చాలా నిరపరాధిని. నా అపరాధం ఆశయంకోసం పెనుగులాడటంమటుకే. నేనేమీ లంచాలు తీసుకోలేదే, అందుకనే మీకు నామీద కోపం." ఇలాంటి ధరఖాస్తు పెడితే ఏ అధికారయినా దాన్ని లక్ష్యపెడతాడా! పైగా ఉద్యోగం కావాలంటే, ఇదా వ్రాసే విధానం. కాని చెబితే వినడే! శర్మగారికి చాలా ఆశ్చర్యం వేసింది. ఇదికాకుండా ఇంకో ఉత్తరాల కట్టొకటి రామం రెండవ చేతిలో ఉండటం చూచి అవన్నీ ఎవరికని అడిగారు. రామం చూపించడానికి జంకినకొద్దీ, పైన ఉన్న రెండుత్తరాలూ చదవగానే శర్మగారికి ఎక్కడలేని కోపంవచ్చింది.

"ఏమిటి రామం, ఈ లక్షణం. మంత్రిమండలిలో ఖాళీ ఉంటే, అది నీకిప్పించమని దరఖాస్తు పెట్టకు మేమిటి? ఎవరయినా నవ్విపోతారు.

"నీ ఆరోగ్యం బాగా లేకపోతే ఆరోగ్య శాఖామంత్రికి ఉత్తరం రాసేయడమే, ఏమిటీ, నీ వ్యవహారం?"

"ప్రజల ఆరోగ్యం అంతా మీ చేతిలోనే ఉంది. నేనూ ప్రజలలో ఒకడనే. నా ఆరోగ్యం బాగాలేదు కనుక నాకు స్వస్థత చేకూర్చమని మిమ్మల్ని అర్థిస్తున్నాను."

"సహేతుకంగా ఉండాలని ఎందుకో ఈ ప్రయత్నం? రామం, నీవిలాంటి పనులన్నీ చేస్తే, నాతో ఉండటమే కష్టమవుతుంది జాగ్రత" అన్నారు శర్మగారు.

"ఇక మానేస్తాను లెండి" అన్నాడు రామం.

శ్రుతిమించి రాగానపడిందని తెలుసుకున్నాడు శర్మగారు. ఆఖరుసారిగా తను చేయదలుచుకున్న సహాయం అని చెప్పి, ఒక కంపెనీ మానేజరుగా ఉన్న ఆయన స్నేహితులలో ఒకరికి ఉత్తరం యిచ్చి, రామాన్ని పంపించాడు ఉద్యోగార్థం.

"మీరిదివరకు పనిచేసిన చోటునుంచి ఎందుకు వచ్చేశారు?"

"వాతావరణం సరిపడకనండీ"

"మీకు యిళ్ళు కట్టించడం వచ్చునా?"

"రాకేమండి? అంతకంటెకూడా లంచగొండితనం రూపుమాపడం బాగా వచ్చండి. దానిలో చాలా కృషికూడా చేశాను."

"గుమ్మడికాయ దొంగంటే భుజాలు తడువుకుంటారేం?"

"లంచగొండితనం ఆపటం, మన అందరి ధర్మంకదా అని అన్నానండి. అంతేకాని మరేం కాదు."

"ఏయ్, ఏమిటీవాగుడు" అని శర్మగారితో ఏదో టెలిఫోన్‌లో మాట్లాడారాయన.

"లంచగొండితనం చెడ్డది అంటే మీకుచాలా కోపంవచ్చినట్టుంది. సరే లంచాలు తీసుకుంటాను లెండి."

"ఏయ్, ఈయన్ని ఇక్కణ్ణుంచి గంటెయ్"

ఆ బంట్రోతు జీతం రాళ్ళకోసం పనిచేసే వాడు. లోకమ్మరమత్తంటే వానికేం తెలుసు?

చెయ్యమన్న పని అక్షరాలా చేశాడు. శర్మగారింటికి తిరిగి వచ్చేటప్పటికి, రామం మూటా, గీటా, రోడ్డుమీద పడిఉన్నాయి.

బిస్తర చంకలో బెట్టుకుని నడుస్తుంటే, వీధిలో అల్లరిపిల్లమూక వెంటబడింది.

"ఎక్కడికెడుతున్నావబ్బీ?"

"అబ్బీలేదు, డబ్బీలేదు, అగోమయంలోకి"

"ఆఁ! ఆఁ! ఆ శిశువే యిన్ని అర్భకులరూపం ఎత్తింది. నామీద పగపట్టింది. కాదు నేనుకాదు. భడవా! నువ్వు రాళ్ళుకూడా రువ్వుతున్నావూ? పీకనులిమేస్తాను జాగ్రత. నన్ను రోడ్డుమీది కీడ్చారని నవ్వుకుంటున్నారా? పిల్ల వెధవల్లారా? లంజని పతివ్రత చేస్తారు. పతివ్రతను లంజని చేస్తారు. మీరూ మనుష్యులే? అదిగో, అదే ఆ రాయి రువ్వడమే వద్దన్నది. ఆఁ! నువ్వు చొక్కా చింపేస్తావేం? ఉండండి మీ భరతం పడతాను.

నేనొక్కణ్ణే లోకాన్ని మరమ్మత్తు చేస్తాను. మీ పేగులెక్కపెట్టే రోజులు వస్తాయి. ఉండండి అప్పుడు మీపని నహీ, నహీ రక్షతిడుకృణ్ కరణే అయిపోతుంది. హాహ్హాహ్హా! ఉండండి, ఆ రోజులు ఇంకా ఎంతో దూరంలో లేవు."

రామం చింకిరిజుట్టు, చిరికిన గుడ్డలు, మాసిన గడ్డం, వెకిలినవ్వు చూసి పిల్లలందరూ పరుగో పరుగు.